సాక్షి జగిత్యాల

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



విప్ 'అడ్లూరి'కి తప్పిన ప్రమాదం

ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారు బోల్తా పడింది. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. -మెయిన్‌లో▸



రైతే 'మార్కెట్'కు రాజు

మార్కెట్ కమిటీలకు ఇక రైతులే పాలకులుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. -8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/20.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోత అధికమవుతుంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

నృసింహుడిపై పట్టింపేది..?

- మహిమాన్విత క్షేత్రంపై చిన్నచూపు
- నాలుగేళ్ల క్రితం రూ.వంద కోట్లు కేటాయింపు
- ఆ నిధులకు ఇప్పటికీ కలగని మోక్షం
- ఆలయంలో వెక్కిరిస్తున్న అభివృద్ధి



ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామివారి ఆలయం

ధర్మపురి: ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి రూ.వంద కోట్లు మంజూరైనా పనులకు మాత్రం మోక్షం లభించడం లేదు. నిత్యం వేలాది మంది వచ్చే ఈ పుణ్యక్షేత్రంపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా.. ఆలయ అభివృద్ధిలో మాత్రం పురోగతి కనిపించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ధర్మపురిలో శ్రీలక్ష్మీనృసింహస్వామి స్వయంభూగా వెలిశారు. ఇక్కడ స్వామివారికి ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలు కూడా ఉన్నాయి. సమీపంలోనే పవిత్ర గోదావరి ఉంది. ఇక్కడి గోదావరిలో స్నానాలు ఆచరిస్తే పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. అందుకే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున వచ్చి ఇక్కడి గోదావరిలో స్నానం ఆచరిస్తారు. అనంతరం స్వామివార్లను దర్శించుకుంటారు. ప్రతిరోజూ వేలాది సంఖ్యలో భక్తులు వస్తున్నా.. ఆలయం మాత్రం వారికి సరిపడా సౌకర్యాలు కల్పించడంలేదు.

రూ.వంద కోట్లకు మోక్షమెప్పుడో..?

మహిమగల నృసింహుడి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ నాలుగేళ్ల క్రితం స్వయంగా ధర్మపురికి వచ్చి రూ.వంద కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ నిధులతో ధర్మపురి ఆలయం రూపురేఖలు ఏడాదిలోపు మారిపోవాలని అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. అయితే నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటివరకు ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా చేపట్టలేదు.

టెండర్ల గండం..

రూ.వంద కోట్లతో చేపట్టే ఆలయ అభివృద్ధి పనులకు టెండర్ల గండం పట్టుకుంది. గత ప్రభుత్వ హయాంలో ముందుగా మొదటి దశలో పది పనులకు రూ.47 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. వాటిలో సుమారు రూ.8కోట్లతో వసతి గదుల నిర్మాణ పనులను వేగవంతం చేశారు. మిగిలిన పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. రెండో విడతలో ఎంచుకున్న పనులకు రూ.17 కోట్లు కేటాయించగా.. కేవలం రూ.15లక్షల విలువైన పనులు మాత్రమే కొనసాగాయి. మిగిలిన పనుల్లో టెండర్లలో అడ్డంకులున్నాయి. మూడో విడతలో 25 పనులకు అనుమతి లభించినా పనుల్లో పురోగతి కనిపించడం లేదు.

రూ.90కోట్లతో చేపట్టే పనులు

- రూ.వంద కోట్లలో భాగంగా రూ.90కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రాథమికంగా అంచనా వేశారు.
- రూ.3కోట్లతో ప్రధాన ఆలయ అభివృద్ధి.
- రూ.2.50 కోట్లతో ఉగ్రనృసింహస్వామి ఆలయ అభివృద్ధి
- రూ.2కోట్లతో రాజగోపురాల పునరుద్ధరణ
- రూ.2కోట్లతో బ్రహ్మపుష్కరిణి (కోనేరు) అభివృద్ధి
- రూ.5 కోట్లతో కల్యాణమండపం నిర్మాణం

రూ.5కోట్లతో గోదావరి తీరంలో ఉన్న మంగలిగడ్డ వద్ద సుందరీకరణ

- రూ.1.80 కోట్లతో శ్రీరామలింగేశ్వర (శివాలయం) అభివృద్ధి
- రూ.50లక్షలతో తుమ్మెనాల వద్ద ఆర్చిగేట్ నిర్మాణం
- రూ.20 కోట్లతో ఆలయం చుట్టు భూసేకరణ
- మిగిలిన నిధులతో ఆలయం బయట, లోపల వివిధ రకాల అభివృద్ధి పనులు. మరో రూ.20కోట్లతో ఆలయం చుట్టు రోడ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఈ పనులకు భూసేకరణపై ఐదుగురు హక్కుదారులు నిరాకరించి కోర్టును ఆశ్రయించారు. నలుగురి విషయంలో ఆలయ పక్షాన్నే కోర్టు తీర్పు ఇచ్చింది. మిగిలిన ఒక్కరి సమస్యను పరిష్కరిస్తే సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.
- కొత్త సర్కారుపైనే ఆశలు
- ఆలయం అభివృద్ధి పనుల విషయంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. కోర్టు విషయం కొలిక్కి వస్తే ఆలయ అభివృద్ధి పనులు జరిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

ఏళ్లు గడుస్తున్నా..

ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి కేసీఆర్ 2019లో రూ.వంద కోట్లు మంజూరు చేశారు. అయితే నాలుగేళ్లు గడుస్తున్నా.. పనుల్లో పురోగతి మాత్రం లేదు. కేవలం పదిశాతం పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. మిగిలిన 90 శాతం పనుల్లో 20 శాతం టెండర్ల దశలో.. 70శాతం పనులకు మోక్షమే కలగడంలేదు. నిధులు మంజూరు తప్పా కనీసం ప్రారంభానికి కూడా నోచుకోవడం లేదు. రూ.వంద కోట్లలో రూ.8కోట్లతో చేపట్టే పనులకు టెండర్లు పిలిచారు. ప్రస్తుతం రూ.రెండు కోట్లతో ధర్మపురిలో వసతి గదుల సముదాయాన్ని నిర్మిస్తున్నారు. అలాగే బస్టాండ్ వద్ద కాంప్లెక్స్ పనులు కొనసాగుతున్నాయి. రాయపట్నం ఆర్చి గేటు పనులు పిల్లర్లకే పరిమితమయ్యాయి.



రూపురేఖలు మారనున్న బ్రహ్మపుష్కరిణి (కోనేరు)



అభివృద్ధి కానున్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం

రీ టెండర్లు నిర్వహిస్తాం



ఆలయ అభివృద్ధి పనులపై గతంలో టెండర్లు పిలిచాం. కాంట్రాక్టర్లు ముందుకు రాక.. పనులు నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం వచ్చింది. దేవాదాయశాఖ మంత్రి, ప్రభుత్వ విప్ ఆదేశాల మేరకు రీ టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్, ఆలయ ఈవో

ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ పెట్టొద్దు



దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

జగిత్యాల: ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, అధికారులెవరూ పెండింగ్‌లో ఉంచకూడదని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని పేర్కొన్నారు. వివిధ సమస్యలపై 16 ఫిర్యాదులు ప్రజావాణిలో వచ్చాయి. వీటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దివాకర్, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు రాజేశ్వర్, శ్రీనివాస్, స్పెషల్‌డెప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్డీవో సంపత్‌రావు, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు పాల్గొన్నారు.

జనరల్ డ్యూటీ అసిస్టెంట్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: మైనార్టీ యువతకు రూరల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్కిల్ ఎంపవర్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్ ద్వారా జనరల్ డ్యూటీ అసిస్టెంట్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ శాఖ సంక్షేమ అధికారి సాయిబాబా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న పథకాలకు మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్‌లోని మైనార్టీ యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ 45రోజులు ఉంటుందని, ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గలవారు మైనార్టీ సంక్షేమ శాఖలో దరఖాస్తులు అందించాలని, వివరాలకు 95024 91900 సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



శమంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థి జి.శమంత్ జాతీయస్థాయి కరాటే పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి వెండిపతకం అందుకున్నాడు. ఈనెల 11న నర్సంపేటలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఈ ఘనత సాధించాడు. శమంత్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ నాగసుధారాణి, పీడీ వినిత్‌కుమార్, హాజీం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు స్పందన



క్రీడాకారులను ఎంపిక చేస్తున్న పీఈటీలు

జగిత్యాల: రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలను సోమవారం జిల్లాకేంద్రంలోని మినీస్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని ఈనెల 21, 22 తేదీల్లో సికింద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, శ్రీనివాస్ తెలిపారు. సాగర్, అరుణ్, నరేశ్, కోచ్‌లు వంశీకృష్ణ, శ్రీరాం పాల్గొన్నారు.

ప్రారంభమైన నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

సారంగాపూర్: బీర్‌పూర్ కొండపై వెలసిన శ్రీలక్ష్మీనృసింహస్వామి స్వామి జాతర బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అర్చకులు ఉత్సవమూర్తులకు అర్చనలు, అభిషేకాలు చేశారు. స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేక పల్లకీపై ఊరేగించారు. ఈ శోభాయాత్ర కొండ దిగి.. బీర్‌పూర్, నర్సింహులపల్లె గ్రామాల మీదుగా మంగళవారం ఉదయానికి తిరిగి కొండపైకి చేరనుంది. ఉత్సవమూర్తులకు హారతులతో స్వాగతం పలికారు. ఎంపీపీ మసర్తి రమేశ్, ఆలయ చైర్మన్ ఎనగంటి సామ్రాట్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఈవో శ్రీనివాస్, అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్నసంతోష్, మధుకుమారాచార్యులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా కరపత్రాలు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోరుట్ల: కోరుట్లలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు వ్యతిరేకంగా సోమవారం కరపత్రాలు పంచారు. 'నిజామాబాద్ ఎంపీగా నియంత అర్వింద్.. కళ్లకు పెట్టుకున్న కూలింగ్ గ్లాస్ తీయడు, ప్రజ లను చూడడు, కారు నుంచి దిగి ప్రజలతో మాట్లాడడు..' అని కరపత్రంలో పేర్కొన్నారు. ఇది ము మ్మాటికీ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి పనేనని ఎంపీ అర్వింద్ తెలిపారు. ఈ మేరకు ఓ వీడియో రిలీజ్ చేశారు. ఎంపీ ఎన్నికల్లో లబ్ధి కోసం జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇలాంటి పనులు చేస్తున్నారని తెలిపా రు. కాంగ్రెస్ ప్రభుత్వం 40 ఏళ్లలో తీసుకురాని పసుబోర్డును తాను తెచ్చానని, ప్రజల్లో ఉన్న అభిమానమే మళ్లీ తనను గెలిపిస్తుందని పేర్కొన్నారు.

బీసీలను అణగదొక్కుతున్న ఎమ్మెల్సీ..

బీసీలను ఎమ్మెల్సీ అణగదొక్కుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ ఆడ బిడ్డనైన తనను ఓడించిన ఆయన.. ఇప్పుడు మరో బీసీ బిడ్డను ఓడించేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ వచ్చేది లేదని, దేశవ్యాప్తంగా మోదీ మానియా కొనసాగుతోందని పేర్కొన్నారు.

కరపత్రాల వెనుక జీవన్‌రెడ్డి హస్తం

మెట్‌పల్లి: ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు వ్యతిరేకంగా వెలిసిన కరపత్రాల వెనుక ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఆయన సోదరుడు దేవేందర్‌రెడ్డి హస్తం ఉందని బీజేపీ కోరుట్ల అసెంబ్లీ కన్వీనర్ సుఖేందర్‌గౌడ్ ఆరోపించారు. జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎమ్మెల్సీగా రైతులకు ఏమీ చేయలేదన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రమేశ్, నాయకులు నవీన్, శంకర్‌గౌడ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ వద్దని రైతుల రాస్తారోకో



ఆందోళన చేస్తున్న రైతులు

జగిత్యాలరూరల్: జాతీయ రహదారిని విస్తరించకుండా మేడిపల్లి మండల కేంద్రం నుంచి తాటిపల్లి, చల్‌గల్, కండ్లపల్లి, హన్మాజీపేట, తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట మీదుగా చేపట్టే బైపాస్ రోడ్‌ను రద్దు చేయాలని తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట గ్రామాల రైతులు సోమవారం తిప్పన్నపేట వద్ద జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారిని ఇరువైపులా విస్తరించాలని, కొత్తరోడ్డు నిర్మాణం చేపడితే రైతులంతా భూములు కోల్పోయి వీధిన పడతారని పేర్కొన్నారు. అలాగే తిప్పన్నపేట శివారులో ఉన్న రైస్‌మిల్లును తొలగించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై సదాకర్ తిప్పన్నపేటకు చేరుకుని రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.



తహసీల్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

జగిత్యాలలో రాస్తారోకో

జగిత్యాల: ఎన్‌హెచ్–63 కోసం చేస్తున్న భూసర్వేను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. ఎన్‌హెచ్–63 గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంపై అధికారులు చేస్తున్న భూసర్వేను రద్దు చేయాలన్నారు. ప్రాణాలైనా అర్పిస్తామని, భూమిని మాత్రం వదులుకోబోమని రైతులు పేర్కొన్నారు. హన్మాజీపేట, పెర్కపల్లి, తిప్పన్నపేట, కండ్లపల్లి, చర్లపల్లి, చల్‌గల్, తాటిపల్లికి సుమారు 500 మంది రైతులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రం అందించారు.

చైర్‌పర్సన్ ఎన్నికకు గ్రీన్‌సిగ్నల్

- ఈనెల 28న 11 గంటలకు ముహూర్తం
- నోటిఫికేషన్ జారీ చేసిన ఎన్నికల సంఘం
- ఇప్పటికే మొదలైన కౌన్సిలర్ల క్యాంపులు

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 28న ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎన్నిక చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ లోపు గెజిటెడ్ ఆఫీసర్‌ను నియమించి.. ఈనెల 24లోపు కౌన్సిలర్లకు నోటీసులు అందించనున్నారు.

ఏడాది అనంతరం..

జగిత్యాల మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పీఠం బీసీ మహిళకు రిజర్వ్ అయ్యింది. 2020 జనవరిలో జరిగిన బల్దియా ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక సీట్లు గెలుచుకుని పద్మశాలీ వర్గానికి చెందిన బోగ శ్రావణిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకుంది. రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమె 2023జనవరి 25న చైర్‌పర్సన్, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. వైస్ చైర్మన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి అప్పగిస్తూ.. అప్పటి కలెక్టర్ రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాదిగా శ్రీనివాస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. మధ్యలో చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలని ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసినా అప్పటి కమిషనర్ కౌన్సిలర్ పోస్టు ఖాళీ ఉందని, ఎలక్షన్ చేపట్టలేమని కమిషన్‌కు లేఖ రాశారు. దీంతో ప్రక్రియ ఆగిపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 10శాతం కన్నా తక్కువ ఖాళీ స్థానాలున్నా చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ఉత్తర్వులు జారీ కావడం.. ఈనెల 28నే చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలని నోటిఫికేషన్ జారీ కావడంతో ఆశావహుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

మొదలైన క్యాంపులు

10శాతంకంటే కౌన్సిలర్ స్థానాలు ఖాళీగా ఉన్నా.. చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవచ్చని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఇప్పటికే క్యాంపులు మొదలుపెట్టారు. మున్సిపాలిటీలో 48 వార్డులున్నాయి. బీఆర్‌ఎస్ 30 స్థానాలు, కాంగ్రెస్ ఏడు, బీజేపీ మూడు, ఏఐఎఫ్‌బీ ఒకటి, ఏఐఎంఐఎం ఒకటి చొప్పున గెలుచుకున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు అధికంగా ఉండడంతో ఆ పార్టీలో ఒకరిని చైర్‌పర్సన్ పదవి వరించే అవకాశముంది. గతంలో మున్నూరుకాపు వర్గానికి చెందిన సమిండ్ల వాణి, పద్మశాలీ వర్గానికి చెందిన జ్యోతి, మరో ఇద్దరు పోటీపడ్డారు. ప్రస్తుతం వీరిలో ఒకరికి చైర్‌పర్సన్ పదవి వరించనుంది. అయితే సమిండ్ల వాణి వైపే కౌన్సిలర్లు మొగ్గుచూపుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.



జగిత్యాల మున్సిపాలిటీ

నోటీసులు జారీ చేస్తాం



చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలని ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 24లోపు కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేస్తాం. ఈనెల 28న ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎన్నిక ఉంటుంది. ఇతర కారణాలతో ఆగిపోతే 29న నిర్వహిస్తాం.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం విద్యాశాఖ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లావ్యాప్తంగా 67 కేంద్రాల్లో 11,365 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, 67మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 67 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఆరుగురు అదనపు డిపార్ట్‌మెంటల్ అధికారులు, నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 22 మంది వాహన ఇన్‌చార్జిలు, కస్టోడియన్లు, 702 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విద్యార్థులు భయాందోళన, ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, డీఈవో జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలి

చిన్నారులందరికీ మార్చి మూడోతేదీ నుంచి 5వ రకు పోలియో చుక్కలు వేయాలని కలెక్టర్ తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులకు 3న బూత్‌స్థాయిలో, 4, 5న ఇంటింటికీ తిరిగి చుక్కలు వేయాలని సూచించారు. డీఎంహెచ్‌వో శ్రీధర్ పాల్గొన్నారు.

'స్వీప్' విస్తృతం చేయాలి


- ఓటర్లు పెరిగేలా చూడాలి
- జనవరి ఒకటి ప్రామాణికం
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

జగిత్యాల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు పెరిగేలా స్వీప్ కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఓటరు నమోదుకు ఈ ఏడాది జనవరి ఒకటిని ప్రామాణికంగా తీసుకుని అప్పటివరకు 18 ఏళ్లు నిండిన వారికి జాబితాలో చోటు కల్పించాలన్నారు. మార్పులు చేర్పులపై ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టామని, రాజకీయ పార్టీల నాయకులకు సమాచారం ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్, శ్రీనివాస్, వరందన్, చైతన్య పాల్గొన్నారు.

కన్నులపండువగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



రాయికల్: మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద చెరువుకట్ట ఆవరణలోని గంగామాత ఆలయం వద్ద గంగాసహిత పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని సోమవారం కన్నులపండువగా నిర్వహించారు. అర్చకులు అంగడి భువనేశ్వర్ వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణతంతుగావించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బీజేపీ రాష్ట్ర నాయకురాలు బోగ శ్రావణి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, అధ్యక్షుడు తోపారపు రవీందర్, కౌన్సిలర్లు ఎలిగేటి దివ్య, కల్లెడ సునీత, ఎలిగేటి సంఘ నాయకులు పాల్గొన్నారు.



వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ



జయంతి కార్యక్రమంలో యువసేన సభ్యులు



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ

జగిత్యాల/జగిత్యాలరూరల్/రాయికల్: వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం గుట్రాజీపల్లిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణితో కలిసి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. శివాజీ విగ్రహం ఏర్పాటు అభినందనీయమన్నారు. హిందు ఆలయాల పరిరక్షణకు ఆయన కృషి గొప్పదన్నారు. మాజీ సర్పంచ్ విజయలక్ష్మీ పాల్గొన్నారు. రాయికల్ మండలకేంద్రంతోపాటు తాట్లవాయి, ఆలూరు, వీరాపూర్, రామాజీపేట, అల్లీపూర్, అయోధ్య, ఇటిక్యాలలో శివాజీ రైతు, సంఘమిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని మంచినీళ్ల బావి వద్ద గల ఛత్రపతి శివాజీ విగ్రహానికి బోగ శ్రావణి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అయ్యప్ప ఆలయంలో ప్రాణప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్



రాయికల్ అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు

రాయికల్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో సాయప్ప చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నివేదిత కృష్ణారావు, వైస్ చైర్మన్ హిమవంతరావు, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాత్రి అయ్యప్ప మహాపడిపూజ కన్నులపండువగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో పట్టణం మార్మోగింది.

రైతే 'మార్కెట్'కు రాజు



కరీంనగర్ వ్యవసాయ మార్కెట్

- మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లుగా వారే నియామకం
- మార్గదర్శకాలు వెలువరించిన ప్రభుత్వం
- పదవీకాలం మూడేళ్లు..
- జిల్లాలో 7 మార్కెట్లు

కరీంనగర్ అర్బన్: వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఇక రైతులే పాలకులుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను వెలువరించగా.. వాటి ప్రకారం కొత్త కమిటీలు ఏర్పాటు కానున్నాయి. వ్యవసాయ మార్కెట్లకు త్వరలోనే నూతన పాలకవర్గాలను ఏర్పాటు చేస్తామని ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. గతంలో ఏడాది ఉండే పాలకవర్గ పదవీ కాలాన్ని రెండేళ్లకు పెంచారు. తాజాగా ఆరేసి నెలలు రెండుసార్లు పెంచాలని నిర్ణయం తీసుకోవడంతో ఇప్పుడు వచ్చే పాలకవర్గాల పదవీ కాలం మూడేళ్ల వరకు ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన పలువురు పదవుల కోసం ఇప్పటికే పైరవీలు మొదలుపెట్టారు. జిల్లాలో కరీంనగర్, జమ్మికుంట, గంగాధర, గోపాల్‌రావుపేట, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్ మార్కెట్లుండగా రిజర్వేషన్ విధానంలో పాలకవర్గాలను ప్రకటించనున్నారు.

18 మంది సభ్యులతో కమిటీ

తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశుగణాల మార్కెట్ల చట్టం-1966 సెక్షన్-5(1), ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం ప్రతీ మార్కెట్‌కు 18 మంది సభ్యులతో కూడిన మార్కెట్ కమిటీ ఏర్పాటవుతుంది. దీని పరిధిలో సన్నకారు రైతులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తిదారులు, పశుగణం, పశుగణ ఉత్పత్తిదారులు ఉంటారు. వీరిలో కనీసం ఐదుగురు సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, అల్పసంఖ్యాక(మైనార్టీ) వర్గాలు, మహిళలై ఉండాలి. అలాగే కమిటీలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు ఉండాలి. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నలుగురు ఉండనున్నారు. మార్కెట్ పరిధిలోని పీఏసీఎస్, సహకార మార్కెటింగ్ సంఘాల నుంచి ఒక సభ్యుడు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారుల్లో ఒక సభ్యుడు, జిల్లా వ్యవసాయ/ఉద్యాన/పశుసంవర్ధక/మత్స్యశాఖ అధికారుల్లో ఒకరు, మార్కెట్ కమిటీ పరిధిలోని మేయర్/మున్సిపల్ ఛైర్‌పర్సన్ లేదా గ్రామ సర్పంచుల్లో ఒకరు సభ్యులుగా ఉండనున్నారు.

ఛైర్మన్, వైస్ ఛైర్మన్ నియామకం ఇలా..

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా 12 మంది రైతుల నుంచి ఒకరిని నియమిస్తారు. వైస్ ఛైర్మన్‌ను లైసెన్స్ ట్రేడర్స్ సభ్యుల నుంచి లేదా రైతు సభ్యుల నుంచి నియమించవచ్చు.

మార్కెట్లఆదాయాన్ని బట్టి గ్రేడింగ్

మార్కెట్‌ల ఆదాయాన్ని బట్టి గ్రేడింగ్ విధానం కొనసాగుతోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రధానంగా పంటల కొనుగోలు పరంగా పన్నుతో ఆదాయం లభిస్తుంది. ఆయా మార్కెట్ల ఆదాయాన్ని బట్టి ప్రభుత్వం గ్రేడ్ ఇస్తుంది. రూ.3 కోట్లకు పైగా ఆదాయం ఉంటే దాన్ని సెలక్షన్ గ్రేడ్‌గా పరిగణిస్తుండగా డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు ఉంటే స్పెషల్ గ్రేడ్‌గా పరిగణిస్తూ ఏడీ క్యాడర్ అధికారిని నియమిస్తారు. రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటే గ్రేడ్-1గా, రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ఉంటే గ్రేడ్-2గా, రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉంటే గ్రేడ్-3గా పరిగణిస్తూ ఆయా గ్రేడ్ స్థాయిని బట్టి అధికారులను, రూ.25 లక్షల వరకు ఆదాయం లభిస్తే దానికి అసిస్టెంట్ సెక్రటరీ స్థాయి అధికారిని నియమిస్తారు. జిల్లాలో కరీంనగర్, జమ్మికుంట మార్కెట్లు సెలక్షన్ గ్రేడ్ కాగా, చొప్పదండి స్పెషల్ గ్రేడ్, హుజూరాబాద్ గ్రేడ్-1, గంగాధర గ్రేడ్-3, మానకొండూరు, గోపాల్‌రావుపేట వేటి పరిధిలోకీ రావు.

రిజర్వేషన్లతో ఛైర్మన్ పదవులు

రిజర్వేషన్ల ప్రకారం ఛైర్మన్ పదవులు వరించనున్నాయి. ఆయా మార్కెట్లకు ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం ఛైర్మన్లను నియమించనున్నారు. కరీంనగర్ మార్కెట్ పాలకవర్గానికి బీసీ, జమ్మికుంట-ఎస్సీ మహిళా, మానకొండూరు-ఎస్టీ, గంగాధర-జనరల్ మహిళా, గోపాల్‌రావుపేట-జనరల్ మహిళా, చొప్పదండి-ఎస్సీ, హుజూరాబాద్- జనరల్ మహిళకు కేటాయించారు.

క్లుప్తంగా

డ్రామా పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక



కరీంనగర్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి డ్రామా పోటీల్లో రామడుగు మండలం రుద్రారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జెండర్ డిస్క్రిమినేషన్ అనే డ్రామా అంశంలో పాల్గొని సత్తాచాటిన గోనే వైష్ణవి (9వ తరగతి), పల్లి ప్రణయ, పింగిలి అనన్య, వెలుమల సహస్ర, కొక్కుల శివమణి (8వ తరగతి)లను గైడ్ టీచర్ శ్రావణ్‌కుమార్, డైట్ ప్రిన్సిపాల్ పి.మొండయ్య, వినయధర్ రాజు, సీహెచ్ ప్రద్యుమ్నకుమార్, జి.శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ రంగనాథశర్మ అభినందించారు.

కల్వర్టు వద్ద లారీ బోల్తా



మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. మధ్యప్రదేశ్ నుంచి గోధుమల లోడ్‌తో వరంగల్ వైపు వెళ్తున్న లారీ మేడిపల్లి - వెంకట్రావుపేట మధ్య కల్వర్టు వద్ద ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఏవరికీ ఏమీ కాలేదు. లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో రెండుప్రమాదాలు చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రాయికల్: రాయికల్ మండలం రామాజీపేటలో అక్రమంగా నిలువ ఉంచిన 12 క్వింటాళ్ల రేషన్ య్యాన్ని పట్టుకున్నట్లు జగిత్యాల, మల్యాల సివిల్ సప్లై డీటీలు వరప్రసాద్, శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. రామాజీపేటలో బియ్యం నిలువ చేశారనే పక్కా సమాచారంతో దాడులు చేశామని, ఇందులో 12 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని వారు తెలిపారు. దాడుల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పద్మయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన నేవూరి చంద్రారెడ్డి(70) సోమవారం ఉదయం అదృశ్యమయ్యాడు. అతడి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. పోలీసుల వివరాలు.. చంద్రారెడ్డి ఏడాదిగా మతిస్థిమితం సరిగా లేకుండా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడికి భార్య లక్ష్మి, కుమారులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కూతురు వెంకటవ్వ ఉన్నారు.

చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నిక



అనూప్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా జిల్లా కార్యదర్శి, అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారుడు కంకటి అనూప్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అనూప్ కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెస్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆయనను తెలంగాణ రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యాక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, కరీం, పెటా అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ.యూనిస్ పాషా, జూడో సంఘం రాష్ట్ర సభ్యులు మహేందర్, సురేందర్ సింగ్, వికాస్, గౌతమ్, సందీప్ తదితరులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్ వరంగల్, రంగారెడ్డి



తృతీయ స్థానంలో నిలిచిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పురుషుల, మహిళల జట్లు

- ద్వితీయస్థానాల్లో హైదరాబాద్, వరంగల్
- ఉమ్మడి కరీంనగర్ జట్లకు తృతీయ స్థానం
- ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు



కరీంనగర్‌స్పోర్ట్స్: 52వ తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పురుషుల చాంపియన్‌గా వరంగల్ జట్టు, మహిళా చాంపియన్‌గా రంగారెడ్డి జిల్లా జట్లు నిలిచాయి. పురుషుల విభాగంలో హైదరాబాద్ ద్వితీయ, కరీంనగర్ తృతీయ స్థానం సాధించగా మహిళల విభాగంలో వరంగల్ ద్వితీయ, కరీంనగర్ తృతీయ స్థానాలు సాధించాయి. కరీంనగర్‌లోని లయోలా జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిసాయి. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కొత్త సతీశ్‌రెడ్డి, తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్‌లు హాజరై విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ క్రీడాకారులు ఇటీవల వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్లకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల పరిశీలకుడు దీపక్ ప్రసాద్, కరీంనగర్ జిల్లా యువజన క్రీడాధికారి శ్రీకాంత్‌రెడ్డి, బసరవేణి లక్ష్మణ్, నమిలకొండ ప్రభాకర్, మూల వెంకటేశ్, నర్సయ్య, సత్యానంద్, రాజ్ కుమార్, రూపారాణి, నాగుల శ్రీనివాస్ వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బందిని సస్పెండ్ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కరీంనగర్: ఎంసీహెచ్‌లో శిశువు అపహరణ నిర్లక్ష్యం వల్లే జరిగిందని, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి బ్రామండ్లపల్లి యుగంధర్, అధ్యక్షుడు బోనగిరి మహేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందించారు. గతంలోనూ శిశువుల మిస్సింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయని, అయినా సిబ్బంది పనితీరులో మార్పు రావడం లేదన్నారు. తాజా సంఘటనకు డ్యూటీలో ఉన్న సెక్యూరిటీ గార్డు, జీఎస్ఎం, ఏఎస్ఎం, వైద్యులు, అధికారులను బాధ్యులను చేస్తూ వారిని సస్పెండ్ చేయాలని విన్నవించారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఔట్‌పోస్టు లేదని, ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటీపైనే ఆధారపడటంతో భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చెంచల మురళి, నాయకులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ ప్రచారాన్ని నమ్మొద్దు



మాట్లాడుతున్న భీంరెడ్డి, నాయకులు

విద్యానగర్(కరీంనగర్): పౌల్ట్రీ పరిశ్రమను దెబ్బతీసే కుట్రలో భాగంగా బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ వచ్చిందని కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు దీన్ని నమ్మవద్దని నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.భీంరెడ్డి, బ్రాయిలర్ రైతుల సంక్షేమ సంఘం సభ్యుడు డి.జనార్దన్ రెడ్డి కోరారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిత్యం ఒడిదుడుకుల మధ్య సాగే పౌల్ట్రీ పరిశ్రమను నిర్వహిస్తున్న యాజమాన్యాలను నష్టాలపాలు చేసేందుకు కావాలనే విషప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. సమ్మక్క జాతర నేపథ్యంలో చికెన్, కోడిగుడ్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని దళారులు లాభాలు పొందేందుకు వదంతులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. సంఘం ప్రతినిధులు ఎం.ఖదీర్, పాదం రాజు, సంకిటి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.నర్సింహులు పాల్గొన్నారు.

వివాహిత మృతికి కారణమైన అత్తింటివారిపై కేసు

ముస్తాబాద్(సిరిసిల్ల): వివాహిత మృతికి కారణమైన అత్తింటివారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన పంతం నాంపెల్లి కూతురు లాస్య(25)కు మూడేళ్ల క్రితం ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన కొండుగూరి దేవరాజుతో వివాహం జరిగింది. సిద్దిపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న లాస్యపై భర్త అనుమానం పెంచుకున్నాడు. అదనపు కట్నం కోసం వేధించాడు. దీంతో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లాస్య ఉరివేసుకుంది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబసభ్యులు సిద్దిపేటలోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. భర్త, అత్తామామలు నర్సయ్య, వజ్రమ్మ, ప్రవీణ్, కల్యాణిల వేధింపులు తాళలేక లాస్య ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి నాంపెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏపీఏ మైన్‌కు జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న గని మేనేజర్ తిరుపతి

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ అడ్రియాల ప్రాజెక్టు ఏరియా గనికి 2023-24 సంవత్సరానికి గాను 'బెస్ట్ టెక్నాలజీ మైన్ ఇన్ అండర్ గ్రౌండ్' కోల్ విభాగంలో జాతీయస్థాయి అవార్డు దక్కింది. ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వరరావు, అడిషనల్ మేనేజర్ శ్రీకాంత్ 'డీప్ అండర్ గ్రౌండ్ కోల్ మైనింగ్'లో సమర్థత, భద్రతను పెంచడం, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కూలింగ్, ట్యూబ్ బండిల్ గ్యాస్ మానిటరింగ్ సిస్టంలతో కూడిన కేస్ స్టడీని సమర్పించారు. దాని ఆధారంగా 'బెస్ట్ టెక్నాలజీ మైన్ ఇన్ అండర్ గ్రౌండ్ కోల్' 2023-2024 కేటగిరీలో అవార్డు దక్కింది. భువనేశ్వర్‌లో జరిగిన సదస్సులో గని మేనేజర్ ములుకుంట్ల తిరుపతి జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు.

లారీ ఢీకొని విద్యార్థిని దుర్మరణం

- బొమ్మకల్ ఫ్లై ఓవర్ సర్కిల్‌లో ఘటన



దియాపటేల్ (ఫైల్)

కరీంనగర్‌రూరల్: లారీ ఢీకొని ఓ విద్యార్థిని దుర్మరణం చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన వాసాని జగదీశ్ కొన్నేళ్ల క్రితం తన భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్ వచ్చి, ఇక్కడే ఉంటున్నాడు. స్థానికంగా కట్టెకోత మెషీన్ పని చేస్తున్నాడు. ఆయన పెద్ద కూతురు దియాపటేల్(19) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం 8 గంటలకు గోపాల్‌పూర్ నుంచి ఎలక్ట్రికల్ స్కూటీపై కరీంనగర్ వెళ్తోంది. బొమ్మకల్ ఫ్లైఓవర్ సర్కిల్‌లో గోదావరిఖని నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 14 టైర్ల లారీ వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దియాపటేల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంటకే మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్ శివారు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పికప్ వాహనాన్ని సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్ హౌస్ అధికారి శ్రీనివాస్‌రావు వివరాల ప్రకారం.. మండంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన గాంతుల సత్తయ్య తన పికప్ వాహనంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నారాయణపూర్ మానేరువాగు నుంచి ఇసుకను కామారెడ్డి జిల్లా కేంద్రంలో అమ్మడానికి తరలిస్తుండగా గొల్లపల్లిలో పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి సత్తయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

కరీంనగర్‌క్రైం: ఎల్లారెడ్డిపేట మండలం అక్కన్నపేటకు చెందిన ఎ.సుజాత (22) యువతి ఈనెల 17న కరీంనగర్‌లో అదృశ్యమైనట్లు సోమవారం ఆమె కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుజాత ఈనెల 17న కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తన బంధువును చూసేందుకు వచ్చింది. ఆదే రోజు ఆమె సర్టిఫికెట్ల పనిమీద హైదరాబాద్‌కు వెళ్తానని చెప్పడంతో వారి సమీప బంధువు ఒకరు బైక్‌పై బస్టాండ్‌లో దించాడు. అప్పటి నుంచి ఆమె ఫోన్ పనిచేయకపోవడంతో ఆచూకీ కోసం హైదరాబాద్‌లోని స్నేహితుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె తాత వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలం ఓగులాపూర్ గ్రామానికి చెందిన వృద్ధుడు బోయిని మల్లయ్య (65) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై బండి రాజేశ్ తెలిపిన వివరాలు... ఓగులాపూర్‌కు చెందిన మల్లయ్య ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చాలా ఆసుపత్రిల్లో చికిత్స చేయించిన నయం కాలేదు. దీంతో మానసికంగా వేదనకు గురయ్యాడు. జీవితంపై విరక్తితో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొడుకు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.



కామారెడ్డి బస్సులో కిక్కిరిసిన జనం



సిరిసిల్ల బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

బస్సుల కొరత.. ఇబ్బందుల తీవ్రత





సమయానికి బస్సులు రాక సోమవారం సిరిసిల్ల బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మేడారం జాతరకు సిరిసిల్ల డిపో నుంచి 32 బస్సులు పంపించారు. డిపోలో మొత్తం 61 బస్సులు ఉండగా అందులో సగం జాతరకు పంపడంతో బస్సుల కొరత ఏర్పడి, సమయానికి రాక ప్రయాణికులు చాలాసేపు నిరీక్షించారు. తీరా బస్సులు బస్టాండ్‌కు రావడంతో సీట్లకోసం ఎగబడ్డారు. నిల్చోడానికి చోటు లేక చివరికి ఫుట్‌బోర్డ్ ప్రయాణం చేశారు. అసలే పెళ్లిల్ల సీజన్ కావడంతో జనంతో బస్టాండ్ కిక్కిరిసింది. చాలా సేపు బస్సులకోసం వేచి చూసి గత్యంతరం లేక సమయానికి ఇంటికి చేరుకునేందుకు ఆటోలను ఆశ్రయించారు. ఇదే అదనుగా భావంచిన ఆటోవాలాలు అధిక చార్జీలు వసూలు చేశారు. ఇదేం గోసరో నాయనా అంటూ జనం ప్రయాణం సాగించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

ఇలవేల్పునకు నీరాజనం

వేములవాడ: వేములవాడ రాజన్నను సోమవారం 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సమ్మక్క జాతర సమీపిస్తుండటంతో తమ ఇలవేల్పుకు మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి సుమారు 5 గంటల సమయం పట్టింది. క్యూలైన్లు ఎక్కడికక్కడ నిండిపోయాయి. భక్తుల ద్వారా రూ.45 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.





